క్లుప్తంగా

యథావిధిగా ఆర్టీసీ సర్వీసులు

ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్

తెనాలిఅర్బన్: వర్షాల కారణంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేవారి సంఖ్య కొంత తగ్గిందని తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ బుధవారం తెలిపారు. గతంలో రోజుకు రూ.11 లక్షల ఆదాయం డిపోకు వచ్చేదన్నారు. వరదల కారణంగా సుమారు 30 శాతం ఆదాయం తగ్గిందని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం ప్రయాణికులు తక్కువగా ఉన్న అన్ని సర్వీసులను ప్రతిరోజు క్రమం తప్పకుండా నడుపుతున్నట్లు వివరించారు.

వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలిలోని శరణాగతి గోష్ఠి వ్యవస్థాపకులు నరేంద్ర రామానుజ స్వామి ఆధ్వర్యంలో కొల్లిపర, కొల్లూరు మండలాల పరిధిలోని తూములూరు, అన్నవరపు లంక, ఈపూరు లంక గ్రామాలలో బుధవారం భోజనం ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు వేల మందికి భోజనం ప్యాకెట్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తన్నీరు సీతారామయ్య, విష్ణుమొలకల వాలేశ్వరరావు, మంగమూరి సురేంద్ర, బండారు వాసుబాబు, ఈదర కోటేశ్వరరావు, శివనాగ మల్లేశ్వరరావు, తన్నీరు శివశంకర్, చుక్కా భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఇబ్బందులు కలుగకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: వర్షాల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని మారీసుపేట, యడ్లలింగయ్యకాలనీ, గురువయ్య కాలనీ, అయితానగర్ తదితర ప్రాంతాలలో బుధవారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని మురుగు కాల్వలను పరిశీలించారు. ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇబ్బందులు తలెత్తిన వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

భారీ ఊరేగింపుతో ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



తెనాలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానకవేదిక-తెనాలి, గుంటూరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత పదిరోజులుగా జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. గత నెల 26వ తేదీన స్థానిక బాలాజీరావుపేటలోని గద్దిపాటి అంజయ్య కల్యాణ మండపం దగ్గర నిర్మించిన ప్రత్యేక వేదికపై శ్రీకృష్ణుడి ప్రతిమను ఉంచి, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం జ్ఞానరీత్యా నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం చేశారు. చివరిరోజైన బుధవారం శ్రీకృష్ణ ప్రతిమను బాలాజీరావుపేట, పరిసర ప్రాంతాల్లో కోలాహలంగా ఊరేగించారు. దీంతో వేడుకలు ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక-గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, రొంపిచర్ల రామకృష్ణ, కృష్ణారావు, బ్యాంకు శ్రీను, శివలింగం, రామోజీ, హరిబాబు, బ్రహ్మం, పట్టాభి, శ్రీను, తెనాలి, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, భీమవరం, నూజివీడు, విజయవాడ నుంచి భక్తులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ



మంగళగిరి: నగరంలో గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేపిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గణేశ్ విగ్రహ ప్రతిష్ఠకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకుని పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. రోడ్లు, కాలిబాటలు, వివాదాస్పద భూముల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, మండపం వద్ద మద్యపానం జూదాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని వివరించారు. మండపం వద్ద 24 గంటలూ ముగ్గురు వలంటీర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. మైకులకు పోలీసుల అనుమతి తీసుకోవాలని, ఇరుగుపొరుగు నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా చూసుకోవాలని హితవు పలికారు. ఊరేగింపుల్లో డీజేలు, డ్యాన్స్‌లకు, బాణాసంచాకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

వరద బాధితులకు.. అండగా...

రూ.లక్ష విలువైన నిత్యావసరాల పంపిణీ

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ 'అన్నదాత సుఖీభవ' ఆధ్వర్యంలో బుధవారం వరద బాధిత కొల్లిపర మండలం అన్నవరపు లంక గ్రామంలోని 350 కుటుంబాలకు రూ.లక్ష విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. ఇందులో రిఫండ్ ఆయిల్, కందిపప్పు, సబ్బులు, ఉల్లిపాయలు, కూరగాయలు, పండ్లు ఉన్నాయి. ఇందుకోసం దాతల స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలను ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. తెనాలి డబల్ హార్స్ ఫౌండేషన్ రూ.30 వేల విలువైన 350 ప్యాకెట్ల కందిపప్పును అన్నదాత సుఖీభవ సభ్యులచే ఉచితంగా అందజేశారు. గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ జె. మోహన్ రావు గారు, కొల్లిపర ఎంపీడీవో వీరమాచినేని విజయలక్ష్మి, ఎంపీడీవో ఆఫీస్ సూపరింటెండెంట్ చంద్రమోహన్, అన్నదాత సుఖీభవ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, జి.వి.నారాయణ, దుబా సందీప్, శిఖినం వరప్రతాప్, కొత్తగొర్ల శ్రీనివాసరావు, పోతార్లంక శ్రీనివాసరావు, తుల్లిమిల్లి పోతురాజు, జాన్ వెస్లీ, తుల్లిమిల్లి చంటి, అత్తోట ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, బొల్లిముంత అంకమ్మరావు, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సరుకుల పంపిణీ చేస్తున్న అన్నదాత సుఖీభవ సభ్యులు

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

కొల్లిపర మండల గ్రామం తూములూరులోని పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బొమ్మువానిపాలెం, అన్నవరపులంకకు చెందిన 110 కుటుంబాలకు పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీచే బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ డి.శారద, తన వలంటీర్లతో కలిసి వెళ్లి సొసైటీ తరపున కొల్లిపర మండల ఎంపీడీవో ఆధ్వర్యంలో ఈ సేవను నిర్వర్తించారు. వలంటీర్లు రాజేశ్వరి, శిరీష, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ మనోహరం

డబుల్‌హార్స్ ఫౌండేషన్ రూ.10 లక్షల వితరణ

పట్టణానికి చెందిన అంతర్జాతీయ ప్రముఖ వ్యాపారసంస్థ డబుల్‌హార్స్ మినపగుళ్ల రాష్ట్రంలో నెలకొన్న వరదబాధితుల సహాయానికి తన వంతుగా రూ.10 లక్షల విరాళాన్ని అందజేసింది. డబుల్‌హార్స్ ఫౌండేషన్ తరపున రూ.10 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి పంపారు. వరద బాధితుల సాయంకోసం తమ ఫౌండేషన్ తరపున విరాళం అందజేసినట్లు ఫౌండేషన్ ట్రస్టీ ఎం.య జుర్వేద్ ముఖ్యమంత్రికి పంపిన లేఖలో తెలియజేశారు.

విలువైన మందుల వితరణ

వరద బాధితుల సహాయార్థం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం రూ.25 వేల విలువైన మందులను భట్టిప్రోలు మండల గ్రామం వెల్లటూరు పీహెచ్‌సీకి అందజేశారు. వెల్లటూరు, పరిసర లంక గ్రామాల్లోని ప్రజల అవసరార్థం వీటిని సమకూర్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావులు రొటేరియన్ డాక్టర్ జీవన్‌లత ద్వారా జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విజయమ్మకు మందులను అందజేశారు. డాక్టర్ రామలక్ష్మి, మోటూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి సతీమణి నిత్యావసరాల పంపిణీ

రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సతీమణి, డాక్టర్ మనోహరం బుధవారం కొల్లిపర మండలంలోని తూములూరు, హనుమాన్‌పాలెంలోని వరద బాధితుల పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఆయా శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న వివిధ గ్రామాలకు ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం బొమ్మువానిపాలెం గ్రామానికి వెళ్లి, అక్కడ నీటమునిగిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులతోపాటు మంత్రి ఓఎస్‌డీ ఏసురత్నం, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మందులను అందజేస్తున్న రోటరీ క్లబ్ బాధ్యులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

ఉమేష్‌చంద్రకు ఘన నివాళి

తెనాలిరూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 25వ వర్ధంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చెంచుపేటలో జరిగిన కార్యక్రమంలో ఉమేష్ చంద్ర కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఎస్పీ బి.జనార్ధనరావు, పలువురు పోలీస్ అధికారులు, ఉమేష్ చంద్ర కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిగా ఉమేష్ చంద్ర సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. యువతరం ఆయన ధైర్య సాహసాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకిత భావం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసాంఘిక శక్తులపై ఉమేష్ చంద్ర ఉక్కు పాదం మోపారని గుర్తు చేసుకున్నారు. అటువంటి నిజాయితీ కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. తెనాలి త్రీ టౌన్ పోలీసుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సిఐలు ఎస్ రమేష్‌బాబు, మల్లికార్జునరావు, బెల్లం శ్రీనివాసరావు, ఎస్‌ఐ ప్రకాశరావు, ఉమేష్‌చంద్ర కుటుంబ సభ్యులు, సన్నిహితులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, పోలీసులు

పునరావాస కేంద్రాల పరిశీలన

తెనాలిరూరల్: మండలం బుర్రిపాలెం, అంగలకుదురు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. బుర్రిపాలెంలోని ఎస్టీ కాలనీ శనివారం అర్ధరాత్రి ఇక్కసారిగా ముంపునకు గురవగా, అక్కడి 47 కుటుంబాలకు చెందిన 150 మందిని గ్రామంలోని జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి ఆదివారం తెల్లవారుజామున తరలించిన సంగతి తెలిసిందే. అలానే అంగలకుదురు వద్ద తుంగభద్ర సైడ్ ఛానల్ పొంగడంతో పొలాలు నీట మునిగాయి. గ్రామంలో వరద నీరు వచ్చి ముగంపుకు గురైన ప్రాంతంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ రెండు కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. వాటిలో ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, ఆహారం, వసతి గురించి తెలుసుకున్నారు. ఏ కష్టమొచ్చినా సంబంధిత వీఆర్‌వోలకు సమాచారమివ్వాలని ప్రజలకు సూచించారు. అవసరమైన వారికి వైద్య సహాయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని అధైర్యపడొద్దన్నారు.



బుర్రిపాలెంలోని కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ఉన్నత లక్ష్యంతో శ్రమిస్తే మంచి కొలువులు

మోతడక(తాడికొండ): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో శ్రమిస్తే మంచి కొలువులు సాధించడం సులువే అని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమో ప్రారంభ తరగతులను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత భవిష్యత్‌ను ఇచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, విద్యార్థులు కష్టపడి చదువులో రాణించాలని సూచించారు. వివిధ విభాగాల డీన్‌లు డాక్టర్ పి ఫణికుమార్, డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ పి బాల మురళీ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ నాగ శ్రీనివాసరావు

భవానీ పీఠం ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు



తాడికొండ: విజయవాడ ముంపు బాధితులను ఆదుకునేందుకు తాడికొండ భవానీ పీఠం ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్‌ను అందజేసేందుకు అర్చకులు కోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో భక్తులు తరలివెళ్లారు. వాహనాన్ని తాడికొండ సీఐ కె.వాసు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు పీఠం ఆధ్వర్యంలో ముందుకు రావడం అభినందనీయమన్నారు.

రైతులను ఆదుకోవాలి

తాడికొండ: పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి కోరారు. బుధవారం తాడికొండ మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావుతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట పంటకు రూ.15 వేలు, మాగాణికి రూ.20 వేలు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు 100 శాతం రాయితీపై పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుర్రంకొండ సత్యానందం, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుపై హర్షం

తెనాలి: గతంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ నేత శ్రీధర్ గడ్గె' కులగణన పనికిరాని కసరత్తు'గాను, ' సమాజ హితానికి ఏమాత్రం పనికిరాదు' అనడాన్ని తీవ్రంగా ఖండించామని, అదే ఆర్.ఎస్.ఎస్ కేరళలో జరిగిన జాతీయ సమన్వయ సమావేశాల్లో జనగణనలో సమగ్ర కులగణనకు మద్దతు తెలపడంపై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. కులగణన సమాచారాన్ని అణగారిన వర్గాల సంక్షేమం-అభివృద్ధికి అవసరమైన డేటా కోసమే ప్రభుత్వాలు వినియోగించాలి తప్ప, రాజకీయ అవసరాలకు మాత్రం వాడుకోరాదంటూ ఆంక్షలు విధించడాన్ని తప్పుపడుతున్నామన్నారు. సమాజ హితానికి, కులాల ఉన్నతికి ఉపయోగపడాలంటూనే, మత భావనలను రాజకీయాలకు జోడించి, వాడుకుంటున్న వారికి మద్దతు తెలిపే ఆర్‌ఎస్‌ఎస్, ఎన్నికల ప్రచారాంశం కోసమో, రాజకీయ ప్రయోజనాల కోసమో, కులగణన వివరాలు (డేటా) వాడకూడదని ఆంక్షలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు అవసరమని స్పష్టంచేశారు.

బీఎల్వోల ఇంటింటి సర్వే



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ టి.రాజారమేష్ మోహన్ బుధవారం తెలిపారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామని చెప్పారు. ఇంటింటికి వెళ్లి జాబితా పరిశీలించి దానిలో తప్పొప్పుల సవరణకు యాప్‌లో అర్జీలు పెట్టుకునేలా సహకరిస్తారని చెప్పారు. గతనెల 20 నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుందని, దీనిలో భాగంగా ఓటర్ల వివరాలు జాబిలో నమోదు, నూతన ఓటర్ల కోసం ఫాం-6, చనిపోయిన వారివి తొలగించుటకు ఫాం-7, ఒక ప్రాంతంలో ఉండి మరో ప్రాంతానికి బదిలీ నమోదుకు ఫాం-8 ఉంటుందని పేర్కొన్నారు. మండలంలో 65 పోలింగ్ బూత్‌లు ఉండగా 65 మంది బీఎల్‌వోలు సర్వే చేస్తున్నారని చెప్పారు. ఉద్యోగరీత్యా భార్య, భర్త వేరువేరు ప్రాంతాల్లో ఉన్నా.. సవరణ చేసుకునేందుకు వీలవుతుందన్నారు. సర్వేలో భాగంగా ఇంటింటికీ వచ్చిన బీఎల్‌వోలకు సహకరించి తప్పొప్పులు సరిచేసుకోవాలని సూచించారు.

ఏపీ గురుకులంలో గెస్ట్ టీచర్లకు ఆహ్వానం

తాడికొండ: తాడికొండలోని ఏపీ గురుకుల పాఠశాలలో పనిచేయుటకు గెస్ట్ టీచర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండలోని ఏపీ గురుకులం(స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ) ప్రిన్సిపల్ పి.జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ సైన్స్, గణితం సబ్జెక్టులకు సంబంధించి గెస్ట్ టీచర్ల అవసరం ఉంది కాబట్టి సంబంధిత సబ్జెక్టులలో పీజీ/ బీఎడ్ అర్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు 8712625037 నంబరుకు లేదా నేరుగా సర్టిఫికెట్‌లతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

పెమ్మసాని ఫౌండేషన్ చేయూత



తాడికొండ: వరద బాధితులు, పునరావాస కేంద్రాల్లో తల దాచుకున్న వారికి బుధవారం పెమ్మసాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో రగ్గులు, వాటర్ బాటిళ్ళు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి పెమ్మసాని రవిశంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ వరద బాధిత ప్రాంతాలైన వెంకటపాలెం, తాళ్ళాయపాలెం, ఉద్దండరాయునిపాలెం పునరావాస కేంద్రాలు లింగాయపాలెం, రాయపూడి, హరిశ్చంద్రాపురంలోని బాధితులు 2,000 మందికి రగ్గులు వాటర్ బాటిళ్లు అందజేశారు. వరద బాధితుల సహాయార్థం పెదపరిమి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కావూరి దాసు రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌కు అందజేశారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉపాధ్యాయ పని సర్దుబాటును నిలిపివేయాలని మోడల్ టీచర్స్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు రవికుమార్ కోరారు. బుధవారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసిన సంఘ నాయకులు పని సర్దుబాటు ప్రక్రియలో జరిగిన అవకతవకలు సరి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లోని మిగులు ఉపాధ్యాయులను నగరపాలక సంస్థల పాఠశాలల్లో సర్దుబాటు చేయటం నిబంధనలకు వ్యతిరేకమని, తక్షణమే సంబంధిత ఉపాధ్యాయులను జెడ్పీ, మండల పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలలకు పంపాలన్నారు. ఆర్జేడీని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, నగర అధ్యక్షుడు వై.మనోజ్‌కుమార్, సయ్యద్ అర్ఫతుల్లా, పి.రమేష్, కె.గోపి ఉన్నారు.

మెడికల్ కాలేజీకి మెరైన్ ఇంజినీరు శరీరదానం



కర్పూరపు వెంకటరావు (ఫైల్)

తెనాలి: 'నా మరణానంతరం నేత్రాలను, మృతదేహాన్ని దానం చేసేందుకు విల్లు రాసి వున్నా. నా మరణం ఎక్కడ, ఎప్పుడు సంభవించినా, నా నేత్రాలను దగ్గర్లోని ఐ బ్యాంకుకు, నా మృతదేహాన్ని దగ్గరలో ఉన్న మెడికల్ కాలేజీకి ఇవ్వగలరు' అంటూ మెరైన్ ఇంజినీరు చేసిన అభ్యర్థనను ఆ కుటుంబసభ్యులు తూచ తప్పక పాటించారు. తెనాలిలోని అమ్మ ఐ, ఆర్గాన్, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సహకారంతో పూర్తిచేశారు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా పేరేచర్లకు చెందిన కర్పూరపు వెంకటరావు మెరైన్ ఇంజినీరు. కొద్దిరోజులక్రితం అనారోగ్యానికి గురయ్యారు. కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పినా ప్రయోజనం లేకుండాపోయింది. మంగళవారం మృతిచెందారు. ఆయన రాసిన విల్లు ప్రకారం నేత, శరీర దానానికి ఆయన కుమార్తె కర్పూరపు మేఘన శివాని, తెనాలిలోని అమ్మ ఐ, ఆర్గాన్, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ కో-ఆర్డినేటర్ నండూరి నారాయణరావును సంప్రదించారు. ఆ ప్రకారం బుధవారం వెంకటరావు నేత్రాలను డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పటల్‌కు, భౌతికకాయాన్ని మంగళగిరిలోని ఎన్నారై హాస్పటల్‌కు అందజేశారు.

రోటరీ క్లబ్‌చే గురుపూజ మహోత్సవం



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతమ్మ కళ్యాణ మండపంలో గురుపూజ మహోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, పీడీజీ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు అతిథులుగా హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రావి చిన్నవెంకటేశ్వర్లు, బుర్రిపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు ఉపాధ్యాయిని వుయ్యూరు పద్మావతి, సంగంజాగర్లమూడి జిల్లాపరిషత్ హైస్కూలు ఉపాధ్యాయిని పొనుగుపాటి లలిత, స్థానిక కెఎస్ మున్సిపల్ హైస్కూలు ఉపాధ్యాయుడు వెలగా సుభాష్‌చంద్రబోస్, నారాకోడూరు హైస్కూలు పీఈటీలు బత్తుల వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, తెనాలి ఎన్ఎస్ఎస్ హైస్కూలు చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్‌ను సత్కరించారు. క్లబ్ కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, కోశాధికారి రమేష్‌కుమార్ బన్నాలి, జిల్లా రోటరీ మెంబర్‌షిప్ చైర్ ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, గుత్తా వెంకటరత్నం, వీరవల్లి మురళి, జీవీ నారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ డి.జీవనలత, ఆలపాటి వెంకట్రామయ్య పాల్గొన్నారు.